# ప్రయోజకుడు

ప్రఫుల్లచంద్ర



అలవైకుంఠ పురంబులో ఆ మూల సౌధాగ్రంబున రేకల షెడ్‌లో ముగ్గురు మిత్రులు. ఒకే ఊరి వాళ్ళు. మధ్య తరగతి మంద భాగ్యుల ముద్దు బిడ్డలు. రెండేళ్ళుగా ఆ షెడ్‌లో వుంటూ మెస్ మెతుకులు కతుకుతూ ఇప్పుడు డిగ్రీ మూడో సంవత్సరం కాలేజీలో వెలగ బెడుతున్నారు.

కాలేజీ జీవితం ఎంజాయ్ చేయడానికే. చదువులతో వేస్ట్ చేసుకోవడానికి కాదని దృఢ విశ్వాసం గల షోమ్ (సోమరాజు), అమ్మాయిలను టీజ్ చేస్తూ సత్కాలక్షేపం చేస్తోంటే - పేడి ముఖం హీరోకి అభిమాన సంఘం ప్రారంభించి ధియేటర్ల చుట్టూ తిరుగుతూ జన్మసార్థకం చేసుకుంటున్నాడు ర్ామ్ (ర్ామారావు).

గత రెండేళ్ళుగా నిరంతర ప్రయాసగా పది మంది అమ్మాయిల్ని విడివిడిగా ప్రేమించి, ఇప్పుడు పదకొండో అమ్మాయి చూపుల్లో చిక్కుకొని ఆమె పాదం మీద పుట్టు మచ్చగా మారిపోతే చాలునని షోమ్ తపన. పేడి హీరో పాద ధూళిగా మిగిలిపోవాలని రామ్ ఆశ.

వీళ్ళిద్దరికీ భిన్నంగా కనిపిస్తాడు శ్యామ్. ఒక రకంగా సత్తెకాలం సత్తెయ్య. ఎం.సి.ఏ చదవాలని ఆశయం. డబ్బు కోసం తండ్రిని యిబ్బంది పెట్టకుండా రోజూ ఉదయం ఒక గంట - ఇంటింటికి పాల ప్యాకట్‌లూ, పేపర్లూ వేసి, సాయంకాలం ట్యూషన్‌లు చెబుతూ సందు దొరికితే పుస్తకాల్లో తల దూర్చే టైపు. అమ్మాయిలతో తిరగడం, సినిమాలు చూడడం, కాలేజీ ఎగగొట్టడం చేతగాని వాడు. అందుకే పీ.పీ(పుస్తకాల పురుగు), యం.పీ(ముద్ద పప్పు) అని గేలి చేస్తూ ఉంటారు మిత్రులు.


భిన్నత్వంలో ఏకత్వానికి చక్కని ఉదాహరణ ఈ ముగ్గురూ. అయితే రామ్, షోమ్‌లు కాస్త జబర్దస్తీ. కల్లిబొల్లి కబుర్లు చెప్పి యింటి నుంచి డబ్బు తెప్పించుకోవడం - ఆ డబ్బు జల్సాలకూ, తిరుగళ్ళకూ సరిపోక శ్యామ్ నెత్తిన చెయ్యి వేయడం పరిపాటి. స్నేహధర్మంగా శ్యామ్ వాళ్ళ ఖర్చులు కూడా నెత్తిన వేసుకోవడం రివాజు అయింది. కాని కాలక్రమేణా స్నేహితుల శృతి మించడంతో ఆలోచనలో పడ్డాడు శ్యామ్.

తాను కష్టపడి సంపాదిస్తున్నదంతా ఈ బడుద్ధాయిలు మింగుతున్నారు. పైగా అవమానించే స్థాయిలో వేళాకోళాలు... ఈ మధ్య జేబులో డబ్బు మాయమౌతోంది. స్నేహభావంతో ఎంత సర్దుకు పోదామన్నా శ్యామ్ మనస్సు చివుక్కుమంటోంది.

★ ★ ★

కాలేజీలో హటాత్తుగా మెరుపు మెరిసింది. ఆ మెరుపు పేరు శిరీష. యస్వీ గారమ్మాయి. అందు వల్ల మగమహారాజులంతా ఆమెకు వందడుగుల రక్షణ దూరం పాటిస్తున్నారు.

ఓ రోజు లెక్చరర్ రాకపోవడంతో చెట్టు కింద కూర్చుని చదువుకుంటున్నాడు శ్యామ్. నిశ్శబ్దంగా




శిరీష వచ్చి అతని ప్రక్కనే కూర్చుంది. ఓ క్షణం అతని వేపే చూసింది గాని, ఆతగాడు తలతిప్పకుండా పుస్తకంలో మునిగిపోయాడు. ఆమె పూసుకున్న సెంటుతో గాలి ఉక్కిరి బిక్కిరి అవుతోంది. ఆమె అందానికి చెట్టు ఆకులు కిలకిలలాడుతున్నాయి. వందడుగుల దూరంలో లైనుకట్టిన మగ(!) సీతాకోక చిలుకలు రెపరెపలాడుతున్నాయి. ఇంత జరుగుతున్నా ఆ మహానుభావుడిలో మాత్రం చలనం లేదు. - పీ.పి, యం.పీ అని ఎవరు పేర్లు పెట్టారో గాని !

చూసి చూసి - " ఎక్స్ క్యూజ్ మీ ! నా పేరు శిరీష. ఈ మధ్యనే మీ క్లాసులో చేరాను. " -

ఆమె మాట పూర్తి కాకుండానే - ఆమె వైపు చూసి చరునవ్వు చిందిస్తూ " మీరు యస్పీ గారమ్మాయి ! మీకు హైస్కూలులో చదువుతున్న ఇద్దరు చెల్లెళ్ళు - సుస్మిత, సురేఖ. వాళ్ళు సరిగా చదవడం లేదని మీ అమ్మగారు రోజు తిడుతూ ఉంటారు ! మీరు రోజూ ఆరు పాల ప్యాకెట్లూ, హిందూ పేపరు తెప్పించుకుంటారు ! " అతడు చకచకా చెబుతోంటే అంతలేసి కళ్ళలో ఆశ్చర్యం నింపుకొని చూస్తుండిపోయింది శిరీష.

" అంతాశ్చర్యం ఎందుకు? మీ యింట్లో పాలప్యాకట్లూ, హిందూ వేసేది నేనే ! నేను వచ్చేసరికి మీరు నిద్రలో ఉంటారు కనుక ఎప్పుడూ చూసి ఉండరు. " గలగలా నవ్వేస్తూ అన్నాడు శ్యామ్.

★ ★ ★

మర్నాడు ఉదయం శ్యామ్ వచ్చేసరికి గుమ్మంలోనే ఎదురైన శిరీష - " డాడి రమ్మంటున్నారంటూ " అతనిని లోనికి తీసుకెళ్ళి సోఫాలో కూర్చోమంది.

యస్పీగారు బాత్‌రూం నుంచి వస్తూనే " మా సురేఖ, సుస్మితలకు ట్యూషన్ చెప్పాలోయ్. నువ్వు మాతోనే వుండొచ్చు. మాతోనే భోజనం... జీతం నెలకి వెయ్యి... " టకటకా చెప్పేశాడు.

అసలే పోలీస్ ఆఫీసర్. ఆయనకు కోపం వస్తే తను కంప్యూటర్లు కాదు కటకటాలు లెక్కబెట్టాలి ! అని సందేహిస్తున్న శ్యామ్‌కి భరోసా యిచ్చింది శిరీష - "మా డాడీ మిమ్మల్ని ఒక కొడుకు లాగ, స్నేహితుని లాగ చూసుకుంటారని. " ఒప్పుకోక తప్పలేదు శ్యామ్‌కి.

తను మకాం మార్చుతున్నట్టు శ్యామ్ చెప్పగానే ఖంగుతిన్న రామ్, షోమ్ - నీకిక్కడ ఏం కష్టం దాపురించిందని నిలదీశారు.

" నేను పై చదువుల కోసం సంపాదిస్తున్నదంతా ఖర్చయిపోతోంది. పైగా జేబులో డబ్బులు పోతున్నాయ్ " నిర్మొహమాటంగా చెప్పాడు శ్యామ్.

" మాకు దొంగతనం అంటగడతావా. " అంటూ రెచ్చిపోయిన రామ్, షోమ్ అతడిని కొట్టడానిక్కూడ సిద్ధపడ్డారు.

" నేను మిమ్మల్ని నిందించడం లేదు. ఒకే ఊరి వాళ్ళం, స్నేహితులం. ఆ బంధం తెగిపోకుండా వుండడానికే నేను వెళ్ళిపోతున్నా. "

★ ★ ★

తన కలల్ని తనే మోసుకోలేని డొక్కు పీనుగులాగ క్షయ సోకిన నక్క లాగ బక్కచిక్కిన రామారావు చేతిలో ఖరీదైన కవరు పెట్టి వెళ్ళిపోయాడు పోస్ట్‌మాన్. ఆ కవరులో ఖరీదైన కాగాతం మీద అందంగా శ్యామ్ రాసిన ఉత్తరం - తను పది రోజుల్లో స్వగ్రామం వస్తున్నాట్ట. ఆ రాత్రి తప్పకుండా భార్యాబిడ్డలతో తమ యింటికొస్తే కలిసి భోజనం చేద్దామని - సందేశం.

అలాంటి ఉత్తరమే సోమరాజుకీ వచ్చింది.

గతం అంతా వాళ్ళ కళ్ళ ముందు కదలాడింది.

ఎవరేది అవాలనుకుంటే అదే అవుతారనీ శ్యామ్ చెప్పే మాట నిజమే అయింది. అతడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవాలనుకున్నాడు, అయ్యాడు - బెంగుళూరులో పాతిక వేల జీతంతో. తాము హీరోగారి పాద ధూళి, ప్రియురాలి పాదం మీద పుట్టుమచ్చ అవ్వాలనుకొని ఆ విధంగానే అట్టడుగు స్థానంలో ఉన్నారు - తను సినిమా థియేటర్‌లో గేటుకీపరు ! షోమ్ పంచాయితీ ఆఫీసులో బిల్లు కలెక్టరు.

రామ్, షోమ్ భార్యాబిడ్డలతో శ్యామ్ యింటికి వచ్చేసరికి అక్కడ పండుగ వాతావరణంలా ఉంది. శ్యామ్ తల్లిదండ్రులతో బాటు, అత్తమామలూ, మరదళ్ళూ కబుర్లు చెప్పుకుంటూ హాయిగా నవ్వుకుంటున్నారు. యస్పీగారమ్మాయి శిరీషనే శ్యామ్ పెళ్ళి చేసుకున్నాడు. ఆమె సాదరంగా వీళ్లని లోనికి ఆహ్వానించింది. కబుర్లూ, కాకరకాయలు అయ్యాక -

జోక్‌లూ, నవ్వులతో భోజనాలు అయ్యాక - టి.వి ఆన్ చేసింది శిరీష. ఠీవిగా కూర్చుంటే విశ్వవిఖ్యాత నటుడు అమితాబ్ బచ్చన్ పరిచయం చేస్తూ " ఈయన శ్యామ్. బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. భార్య శిరీషతో వచ్చారు. శిరీష గారూ ! " నమష్కార్ " అనగానే ముసిముసి నవ్వులు చిందిస్తూ టి.వి లో శిరీష కనిపించింది.

" హాయ్ ! మన శ్యామ్, శిరీషలే " ఆనందాశ్చర్యాలతో చప్పట్లు కొడుతూ అందరూ టీ.వీ ఎదుట సెటిల్ అయిపోయారు ! ఈ సర్‌ప్రైజ్ కోసమే, ఈ ఆనందం కోసమే - ఆ కార్యక్రమాన్ని మూడు వారాల క్రితమే షూటింగ్ చేసినా - ఇంతవరకూ ఎవరికీ - తల్లిదండ్రులక్కూడా చెప్పలేదు శ్యామ్ దంపతులు.

అమితాబ్ బచ్చన్ అలవోకగా ప్రశ్నలు కురిపిస్తోంటే ధీమాగా సమాధానాలు చెబుతున్న శ్యామ్‌ని చూస్తోంటే ఇంటిల్లిపాదికి ఆనందంగా, గర్వంగా వుంది. శ్యామ్ చకచకా జవాబులు చెబుతోంటే సంతోషంగానూ, అతడు గంభీరంగా ఆలోచిస్తోంటే ఉత్కంఠగానూ - " ష్యూర్ ? పక్కా ? కాన్ఫిడెంట్ ? అని అమితాబ్ కవ్విస్తోంటే గంభీరంగా చూస్తూ - శ్యామ్ చెప్పిన జవాబు " సహీ " అని అమితాబ్ ప్రకటించగానే రిలీఫ్‌గా నవ్వుతున్న శిరీష బుల్లితెర మీద కనిపిస్తోంటే ఎంతో థ్రిల్‌గా వుంది వాళ్ళకి.

పదమూడో ప్రశ్నకు శ్యామ్ సమాధానం చెప్పగానే - తనకే స్వంతమైన తమాషా భంగిమలో తలవంచి వంకరగా చూశాడు అమితాబ్. శ్యామ్ చెప్పింది కరక్టా, కాదాని అందరిలోనూ ఉత్కంఠ ! అమితాబ్ అలా చూస్తూ చూస్తూ "మీరు చెప్పింది..." అని ఆగి ఉత్కంఠ మరింత పెంచి "

సహీ మిష్టర్ శ్యామ్ ! పాతిక లక్షలు గెలుచుకున్నారు మీరు !" బిగ్గరగా అన్నాడు.

అందరూ చప్పట్లు కొడుతోంటే " ఇప్పటి వరకూ కోటి రూపాయలు గెలుచుకున్నది ఒక్కరే. ఇద్దరు యాభై లక్షలు, నలుగురు పాతిక లక్షలు గెలిచారు. చూద్దాం మీఅదృష్టం ఎంతదూరం తీసుకువెళ్తుందో" అంటూ పాతిక లక్షలకు చెక్ రాసి శ్యామ్ కిస్తున్నట్టే యిచ్చి చటుక్కున లాక్కున్నాడు అమితాబ్. వీక్షకులంతా ఘొల్లున నవ్వుకోగా " ఈ చెక్‌ను మీకివ్వను. మీరింకా ఎక్కువ గెలుచుకోవాలని నా ఆంకాంక్ష. " అంటూ పధ్నాల్గవ ప్రశ్న సంధించాడు. " ఇంగ్లీష్ క్రికెట్ టీమ్‌కి నాయకత్వం వహించిన హాలీవుడ్ నటుడెవరు ? "

కుర్చీలో ఇబ్బందిగా కదులుతూ గంభీరంగా మారిపోయాడు శ్యామ్.

" ఈ ప్రశ్నకు జవాబు చెబితే మీకు యాభై లక్షలొస్తాయి. కోటికి ఒకే ఒక్క ప్రశ్న దూరం ! " కవ్వించాడు. అమితాబ్. " తప్పు చెబితే మాత్రం మీరు గెలుచుకున్న పాతిక లక్షల్లోంచి ఇరవై ఒక్క లక్షల ఎనభై వేలు తగ్గిపోయి కేవలం మూడు లక్షల ఇరవై వేలు మాత్రమే లభిస్తాయి. "

కుర్చీలో మరింత యిబ్బందిగా కదిలాడు శ్యామ్. తన ప్రత్యేక భంగిమలో తలవంచి చూస్తూ " మీ లైఫ్ లైన్‌లన్నీ అయిపోయాయి. మీరు విరమిస్తే గెలుచుకున్న పాతిక లక్షలూ దక్కుతాయి. " మందహాసం చిందించాడు అమితాబ్.

రిస్క్ ఎందుకని అక్కడితో విరమించాడు శ్యామ్. అమితాబ్ సీటు దిగి " పాతిక లక్షలు తక్కువ మొత్తం ఏమీకాదు. మీతో కలిపి కేవలం ఐదుగురే అంత మొత్తం గెలిచారు. కంగ్రాట్యులేషన్స్ " అంటూ కౌగిలించుకొని చెక్కు యిచ్చేసాడు... శిరీష టీ.వీ ఆపేసింది.

ఇంక ఆ యింటిలో సందడే సందడి. పెద్దలంతా ఆనందబాష్పాలతో నిలబడిపోతే సుస్మిత, సురేఖలు - అక్కా బావల చుట్టూ డాన్స్ చేస్తూ టీ.వీ ప్రకటన లాగా " అవర్ బావా ది గ్రేటెస్ట్" అని పాడడంమొదలు పెట్టారు.

" అవర్ ఫ్రెండ్ ది గ్రేటెస్ట్" అని అరుస్తూ షోమ్ వాళ్ళలో దూరబోయాడు.

" ఆగవయ్యా ! మీరే కదూ, కాలేజీ రోజుల్లో మా బావని పీ.పీ, యం.పీ అని గేలిచేసింది ! " డాన్స్ ఆపి అడిగింది సురేఖ.

గాలి తీసిన బెలూన్ అయ్యాడు షోమ్.

అక్కడున్న పెద్దలకు పాదాభివందనం చేసి, పన్నులు పోను మిగిలిన డబ్బున్న బ్రీఫ్ కేసు తండ్రి చేతిలో పెట్టి " మంచి ఇల్లు కట్టించుకోండి నాన్నా " అంటున్న కొడుకుని, హృదయానికి హత్తుకొని అలాగే ఉండిపోయాడు ఆయన.

అరుదైన ఆ దృశ్యం చూసి అందరూ చప్పట్లు కొడుతోంటే - " మా బావ పీ.పీ కాదు, యం.పీ కాదు. మాబావ ఏ.పి అంటే ఆదర్శపురుషుడు " అంది సుస్మిత సగర్వంగా.


టైము పది దాటింది. ఇక వెళ్తామని లేచారు రామ్, షోమ్ దంపతులు.

వాళ్ళని సాగనంపడానికి గేటు వరకూ వచ్చారు శ్యామ్ దంపతులు. తనివి తీరక మళ్ళీ గేటు వద్ద కబుర్లు.

రామ్, షోమ్‌లకు మిత్రుని దశ చూసి ఆనందంగానూ ఉంది, తమ పరిస్థితికి దుఃఖంగానూ ఉంది. కాలేజీ జీవితం ఎంజాయ్ చేయడానికే అన్నట్లు తాము వేస్టు చేసుకుంటే - శ్యామ్ ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని కృషి చేసి సాధించాడు. నూతిలో కప్పల్లాగా జీవితంలో సెటిల్ అయ్యాక పత్రికల్లో వచ్చే సినిమా బిట్స్, గాసిప్ చదివి జన్మ ధన్యమైనట్టు తాము సంతృప్తి చెందితే నిరంతర విద్యార్థిలాగా శ్యామ్ యింకా యింకా చదువుతూ, నేర్చుకుంటూ కౌన్ బనేగా... లాంటి పోటీల్లో పాల్గొని విజయాలు సాధిస్తున్నాడు. తమ జీవితాలు ఆగిపోతే అతని జీవితం ముందుముందుకు దూసుకు పోతోంది. తమ దృక్పథాల్లోనే తేడా వుంది. తాము ఉత్తి వేస్ట్‌గాళ్లమని దుఃఖం ముంచుకొస్తోంది.

### అభిషేక్ సినిమాలు ఆడకపోవడానికి కారణం

అభిషేక్‌బచ్చన్ సినిమాలు సరిగా ఆడకపోవడానికి గల కారణం అతనికి భాష సమస్య కావడమే. అభిషేక్‌బచ్చన్ పుట్టింది ఇండియాలోనే అయినా పెరిగింది, చదివింది విదేశాల్లోనే. దానిమూలంగా అభిషేక్ హిందీలో



డైలాగులు చెప్పడం కష్టమవుతోంది. సినిమా విజయం సాధించాలంటే డైలాగులు హృదయంలోనించి రావాలి. బహుశా అభిషేక్ దగ్గర హృదయం లేదేమో? అభిషేక్ హృదయాన్ని దోచిన ఆ సుందరి ఎవరో తెలియలేదు.

మిత్రుల జీవితాలు గేట్ కీపర్‌గాను, బిల్లు కలక్టర్‌గాను తెల్లవారిపోకుండా వాళ్ళని ఏదైనా వ్యాపారంలో పెట్టాలని ఆలోచిస్తున్నాడు శ్యామ్.

ఈ మధ్య ప్రజలకు ఆరోగ్యం పట్ల శ్రద్ధ ఎక్కువైంది. జాగింగ్, హెల్త్ క్లబ్, జిమ్‌లకు గిరాకీ పెరుగుతోంది. హెల్త్ డ్రింక్స్, హెల్త్ ఫుడ్ పట్ల శ్రద్ధ పెరుగుతోంది. ముంబాయి, కలకత్తాల్లో హెర్బల్ షర్బత్‌లు అమ్ముతూ లక్షలు ఆర్జిస్తున్న వాళ్ళ గురించి చదివాడు శ్యామ్. ఆరోగ్యానికి ప్రథమ శత్రువులు - పంచదార, నూనె, కారం. అవి లేకుండా రుచికరమైన పదార్థాలు వండి వడ్డించే హెల్త్ ఫుడ్ హోటళ్ళు కేరళలో ప్రారంభమై బ్రహ్మాండమైన వ్యాపారం చేస్తున్నట్టు ఏదో పత్రికలో చదివాడు.

ఏదో నిర్ణయానికొచ్చినట్లు చటుక్కున అన్నాడు శ్యామ్ " కలో గంజో తాగి ఉన్న ఊళ్ళోనే పడివుందాం లాంటి పాత ఆలోచనలు ఈ రోజుల్లో పనికిరావు. సరికొత్త ఆలోచనలతో ముందుకు దూసుకుపోతేనే విజయం ! మీరు నాతో బెంగుళూరు రండి. రెండు నెలలు మా యింటిలోనే వుండి కన్నడం, హిందీ ఇంగ్లీషు ధారాళంగా మాట్లాడటంతో బాటు, హోటల్ మేనేజ్‌మెంట్ నేర్చుకోండి. నా మలయాళీ ఫ్రెండ్ తల్లిదండ్రులు కేరళలో ఉన్నారు. అక్కడి హెల్త్ ఫుడ్ హోటళ్ళ గురించి స్టడీ చేసి రమ్మని వాళ్ళకు ఉత్తరం రాస్తాను. బ్యాంక్‌లోన్‌తో బెంగుళూరులో మనం హెల్త్ ఫుడ్ హోటల్ ప్రారంభిద్దాం. కేవలం ఒక హోటల్ లాగా కాక అత్తవారింటి కొచ్చిన కొత్తల్లుడిలాగ ప్రతి వ్యక్తి ఫీల్ అయ్యేట్టు ఆదరాభిమానాలు కురిపిద్దాం. మొదట్లో కష్ట నష్టాలున్నా తర్వాత పుంజుకొని లాభాలు ఆర్జించగలమని నా నమ్మకం " తన ప్లాన్ వివరించాడు శ్యామ్.

రామ్, షోమ్‌లకు కాలేజీ రోజులు గుర్తుకువచ్చాయి.

" శ్యామ్ ! మేము నిన్నెంతగానో అవమానించాం. గేలిచేశాం. నీ డబ్బులు కాజేశాం. అయినా నువ్వు మాకు బాసటగా నిలిచి మా జీవితాల్ని చక్క దిద్దాలని ప్రయత్నిస్తున్నావ్. యూ ఆర్ రియల్లీ గ్రేట్ ! నువ్వు పీ.పీ, యం.పి కాదు, నువ్వు యూ.పీ అంటే ఉత్తమ పురుషుడివి ! నీ పాదాలు ఒదలం " అని కన్నీళ్ళు పెట్టుకున్నారు.

" అదిగో ! ఆ పాదాలు, పాదధూళి భాష ఒదిలేయండి. పైకి చూడండి ఉన్నతంగా ఆలోచించండి ఎయిమ్ హై " అన్నాడు శ్యామ్.

" పైకి చూస్తే ఏముంది ? పట్టుకొని పీకుదామంటే మీకు పిలక కూడా లేదాయే " అల్లరిగా అంది శిరీష.

అందరూ ఘొల్లున నవ్వుకున్నారు. ❋